

కథ 1994

3

# మూడు రాత్రుల కథ

ఒమ్మి రమేష్‌బాబు

రాత్రి - జడలు విచ్చిన చిమ్మచీకటి. మసక వెన్నెల కూడా ప్రసాదించలేని చంద్ర శకలం ఆకాశంలో. మిణుకు మిణుకుమంటున్న నక్షత్రాలు ఏ క్షణాన్నైనా రాలిపోయే నెరుసుల్లా వున్నాయి. సన్నగా వీస్తున్న గాలికి తాటాకులు మొరుగుతున్నాయి. మామిడిచెట్టు కింద మరీ చీకటిగా వుంది.

చీకటిని మించిన ఆ చీకటిలో ఒంటరిగా కూర్చున్నాడు చందు- ఒక చేయి చుబుకానికి ఆన్చి, మరోచేయి తనకు తనే ధైర్యం చెప్పుకుంటున్నట్టు గుండెల చుట్టూ అదుముకొని. అవ్యక్తమైన బాధతో వివర్ణమైన ముఖం. పదేళ్ల వయసున్న ఆ పసికళ్లలో దిగులు నీడలు.

తాటాకులు మళ్లీ మొరుగుతున్నాయి. సన్నగా వీస్తున్న గాలిలోంచి మనిషి సజీవంగా కాలుతున్న వాసన. ఒక్కసారిగా చందు పెదాలు కంపించాయి. అంతరంగం నిండా అలుక్కుపోయి పిచ్చిగీతలు.

“నాయనా చందూ! పొద్దుపోయినా ఏం చేస్తున్నావురా చెట్టుకింద,” వసంత పిలుపు. మామిడిచెట్టుకి కాస్త దూరంలో తూర్పు దిక్కుగా తాటాకిల్లు. ఒకే నిట్రాట, చుట్టూ నాలుగు గోడలు. తలుపుల్లేని ద్వార బంధం, కిటికీ. కిటికీలో పల్చని వెల్తురు చిలకరిస్తో లాంతరు. ఆ వెలుతుర్లో గుమ్మానికి అనుకుని నిల్చున్న వసంత.

చినిగిన చొక్కా కాలర్‌ని సవరించుకుంటో, అడుగడుక్కీ సత్తువ కూడదీసుకుంటూ తల్లిని సమీపించేడు చందు. సూటిగా ఆమె ముఖంలోకి చూడలేక అతని కళ్లు పక్కకి వాలిపోయాయి. కాలివేళ్లను నేలలోకి గుచ్చుతూ మూగగా నిల్చుండిపోయాడు. చిన్నారి కొడుకు ముఖం బెంగతో ముడుచుకుపోవడాన్ని వసంత గమనించింది. ద్రవించుకపోతున్న రెండు మబ్బుతునకల్లా- ఇద్దరూ. వసంత ఇక నిలవలేకపోయింది. పట్టరాని దుఃఖంతో కొడుకుని తన బాహువుల్లోకి తీసుకోబోయింది. ఆ మార్దవత్వానికి కరిగిపోయేవాడే, ఆమె హృదయానికి హత్తుకపోయేవాడే- కాని దూరంగా తప్పుకున్నాడు. తల్లి గుండెల మీది గాయాలు అతన్ని దూరానికి విసిరేశాయి. ఇద్దరి మధ్యా సిగరెట్ నిప్పుల గుండం- మంటలు పెడుతూ.

“ఎందుకురా దూరం వెళ్తావు. రా నాయనా, నా వొడిలోకి రారా,” అనునయించి చందుని చేరదీసింది వసంత. వొళ్లంతా ప్రేమగా నిమిరింది. లాలించింది. అరమోడ్పు కళ్లతో తల్లి భుజాలమీద తలవాల్చుకున్నాడు చందు.

“మధ్యాహ్నమంతా ఎక్కడెక్కడ తిరిగావో... ఆకలిగా లేదూ?”

“శంకరం మావయ్య రాత్రికి వచ్చేస్తాడా అమ్మా?”

“వస్తాళ్లే. అన్నం తినిపించేదా?” చందూ తల సవరిస్తూ సమాధానమిచ్చింది వసంత. చందు మాట్లాడలేదు. కిటికీకి తగిలించిన లాంతరుని నేలమీదకి దించాడు. వసంత అన్నం కలిపి తినిపించింది. ఎప్పుడూ ఇంతే- ఒక కంచంలో కొడుక్కి తినిపిస్తూనే తనూ రెండు ముద్దలు తినేస్తుంది వసంత. భోజనం ముగిశాక లాంతరు వత్తి తగ్గించి గోడవారగా పెట్టింది. ద్వారానికి తడికని జారవేసి చాప పరిచింది. చాపమీద తల్లి కొంగులోకి ముడుచుకొని పడుకున్నాడు చందు. పడుకున్నాడే గానీ అతని కనుపాపలపైకి నిద్రతెర జారడం లేదు.

చిక్కుల పుట్టలా అంతరంగం. 'ఎటు దారి? ఎలా తప్పించుకోవాలి?' బిగుసుకుంటున్న పిడికిళ్ల నిండా కసి, కోపం. 'నాన్నని చంపేయాలి. చంపేయాలి. కత్తితో పొడిచి చంపేయాలి. నాయుడుగారి తుపాకీ దొంగిలించి తెచ్చి పేల్చేస్తే? బాగా తాగి వున్నప్పుడు గొంతు నులిపి చంపేస్తే? శంకరం మావయ్య నాన్నని చంపగలడా? అసలెప్పటికైనా నాన్న చచ్చిపోతాడా?' చిక్కువీడని వేయిన్నొక్క ప్రశ్నలు. వెంటాడుతున్న ప్రశ్నలు. అన్ని ప్రశ్నల చివరా ఒకే హింసాత్మక సన్నివేశం.

ఈరోజు మధ్యాహ్నమే- సరిగ్గా వొంటిగంట కావొస్తుందప్పుడు. ఇన్‌స్పెక్షన్ పేరుతో స్కూలుకి అర పూట సెలవు ప్రకటించారు. ఉరకలెత్తిన ప్రవాహాలు పిల్లలు. వీధుల్లోకి పరుగులెత్తారు. కొందరు మాత్రం స్కూలు ఆవరణలోనే జారుడుబల్ల దగ్గర ఆటలాడు తున్నారు. చందుకి ఆటల మీద ధ్యాస వుండదు. అతని పంచప్రాణాలు తల్లినే పెనవేసుకొని వుంటాయి.

సెలవు ప్రకటించగానే చందు ప్రవాహమల్లే పరుగుతీస్తూ ఇంట్లోకి అడుగుపెట్టాడు. అంతే! మండు తున్న కొలిమిలోకి నిలువునా కూలిపోయినట్టు అతని చూపులు పటాపంచలయ్యాయి.

ఎదురుగా ఆమె- చేతులు వెనక్కి విరిచికట్టి దాదాపు వివస్త్రయై పడి వుంది. చినిగి పేలికలైన రవిక లోంచి తప్పించుకునే దారిలేక భీతితో వేలాడుతున్న గుండెలు. రక్తం మరకలు దేహం నిండా. అతని చేతిలో సెగలు కక్కుతున్న సిగరెట్- ఆమె గుండెలపై బొబ్బలు రేపుతోంది. సిగరెట్ నిప్పు వొంటిని తాకినప్పుడల్లా ఆ మంటకి తాళలేక ఆమె నేలపై పొర్లుతూ తల బాదు కుంటోంది, పెనుగులాడుతోంది. అసహాయంగా ఆమె విలపించేకొద్దీ అతనిలోని వున్మాదం బుసలు కొడుతూ విజృంభిస్తోంది. మళ్లీ మళ్లీ గాయపరుస్తూ గాయం మీద గాయం చేస్తూ, 'ఇంకెప్పుడూ నా మాటకి ఎదురు చెప్పకని,' ఆమె జుట్టు అదిమి పట్టుకుని ముఖంలోకి సిగరెట్ చూపించి మరీ హెచ్చరిస్తున్నాడు. అదొక అంతు లేని పైశాచిక హింస. ఆ హింసలో పెనుగులాడుతున్నది ఎవరో కాదు, చందు తల్లి వసంత. ఆ రాక్షసత్వాన్ని ప్రదర్శిస్తున్నది అతని తండ్రి జోగులు.

చందూని చూడగానే మరింత ఉగ్రుడయ్యేడు జోగులు.

''ఏంటా చూపు నిలువు గుడ్లేసుకుని. ఫో బయటికి.''

కఠిన స్వరంతో విసిరికొట్టేడు. నిప్పులు కక్కేడు. అప్పటికే చందు కళ్లు తడిసి ముద్దలయ్యాయి. పట్టు తప్పిన చేతిలోంచి పుస్తకాలు నేలరాలాయి. గుమ్మం లోంచి ఎవరో నెట్టినట్టు బయటపడ్డాడు. పరుగు. ఎక్కడినుంచి ఎక్కడికో తెలీదు. పాదాలు ఎటు లాక్కు పోతున్నాయో తెలీదు. ఒకటే పరుగు. స్కూలు ఆవరణ లోకి ప్రవేశించాకగానీ ఆ పరుగు నెమ్మదించలేదు. ఎడతెగని ఆయాసం, ఆవేశం. స్కూల్లో అరుగుమీద చిట్టచివరి స్తంభానికి అనుకుని కూర్చుండిపోయాడు. కొద్దిసేపు మోకాళ్ల మధ్య తల దాచుకున్నాడు.

చందూలో వెక్కిళ్లు తప్ప మాటలు మిగల్లేదు. అన్నీ వెగటు పుట్టించే దృశ్యాలే. వెలిసిపోయిన నీలం రంగు ఆకాశం. పాలిపోయిన చెట్లు. వాడిపోయిన పువ్వులు. వంకరపోయిన భూగోళం.

సాయంత్రం కావొస్తుండగా శంకరం వచ్చాడు చందూని వెతుక్కుంటూ, చందూ మనసులో ఎంత దుఃఖం గూడుకట్టిందో అతనికి తెలుసు. దుఃఖానికి తేలిగ్గా కట్టుకట్టలేమని తెలుసు. కందిపోయిన చందు చెంపల్ని ఆప్యాయంగా తడుముతూ దగ్గరకు తీసు కున్నాడు.

''అమ్మ నీకోసం కంగారుపడుతోందిరా. నడు ఇంటికి.''

లేవదీశాడు చందూని. వస్తూ వస్తూ దారిలో వసంత కోసం మందులు కొన్నాడు. ఇంటికొచ్చాక చాలా సేపు మామిడిచెట్టు కిందే చందుతో కబుర్లు చెప్తూ గడిపాడు. పొద్దుగుంకుతుండగా చందు వద్దని వారి స్తుంటే, 'రాత్రికి తిరిగొస్తానని,' సర్దిచెప్పి వెళ్లిపోయాడు.

లాంతరులోంచి గుడ్డి వెలుతురు నలుదిక్కులా చూస్తోంది. వసంత ఓ పక్కకి ఒదిగిపడుకొంది. అసహ నంగా కదులుతున్నాడు చందు. నిదర పట్టని రాత్రి.

*

గడిచిన అనేక రాత్రులకు ముందు ఓ కాళరాత్రి-

చీకటిలో ఏకాంతంగా నిల్చున్న వసంత కళ్లు తుడుచుకుంది. అదే అదనుగా జోగులు ఆమెకు చేరు వయ్యాడు.

వసంత నర్శింహులుగారి మొదటి భార్య కూతురు. ఆయన కాకినాడలో పేరు మోసిన క్రిమినల్ లాయర్. వసంత చిన్నతనంలోనే తల్లిని పోగొట్టుకుంది. ఆ లోటు తీర్చడానికే నర్శింహులు రెండో పెళ్లి చేసు కున్నాడు. రెండో పెళ్లితో ఆయనకు భార్య దొరికింది గానీ వసంతకి తల్లి దొరకలేదు. పైగా సవతి తల్లికి ఇద్దరు మగపిల్లలు కలిగాక తండ్రి వాత్సల్యం కూడా వసంతకి కరువయ్యింది. అదీగాక సవతి తల్లి దెప్పి

పొడుపు మాటలు, వేధింపులు ఎక్కువయ్యాయి. వయస్సు పెరిగేకొద్దీ ఇంటిచాకిరీని మోసే పనిమనిషిలా మారింది.

ఈ నేపథ్యమే జోగుల్ని రెచ్చగొట్టింది. నర్సిం హులు దగ్గర గుమస్తాగా పనిచేసే జోగులు వసంత మీద కన్నేశాడు. ఏ తలుపు చాటునో వసంత దుఃఖాన్ని దిగమింగుకుంటున్నప్పుడు ఓదార్పు మాటలతో దగ్గ రయ్యాడు. ఆమె ఒంటరితనాన్ని, ఆవేదనని బలహీ నతగా తీసుకుని లోబర్చుకున్నాడు. మాయమాటలు నమ్మి సర్వం అర్పించిందతనికి. చివరికి తెగించి, తండ్రితో తెగతెంపులు చూసుకొని జోగులు వెంట వచ్చేసింది. అదే ఆఖరు- వసంత తిరిగి ఇంటి ముఖం చూడలేదు. ఆమె జీవితం కాకినాడ నుంచి రాజమండ్రికి మారిపోయింది.

జోగులు దృష్టిలో ఆడది 'పంజరానికలవాటుపడ్డ పక్షి'తో సమానం. కొద్దిరోజుల్లోనే వసంతకి అతని అసలు రూపం తెలిసి వచ్చింది. తనలాంటి చాలామంది స్త్రీలు అతని వలలో చిక్కుకున్నారన్న చేదు నిజమూ బయట పడింది. డబ్బున్న పెద్ద మనుషులకి ఆడపిల్లల్ని అప్ప గించే బ్రోకరుగా కూడా జోగులుకి కొంత జీవితముంది. అలాంటి పరిచయాన్నే ఉపయోగించుకుని సత్యం నాయుడి స్థలంలోనే పాక వేయించి వసంతతో కాపరం పెట్టాడు. తొలినాళ్లలో జోగులు అక్కలిద్దరూ ఆమెపై కత్తిగట్టారు.

''అందగత్తెవేలే. నీ ఆటలు సాగటానికి మా సన్నాసే దొరికేడా? అంత గతిలేనిదాన్లా ఏడ్వకపోతే ఏ నుయ్యో గొయ్యో చూసుకోరాదు?'' అడ్డమైన తిట్లన్నీ కాయాల్సి వచ్చేది.

నిజం చెప్పాలంటే జోగులు కన్నా శంకరమే వసంత బాగోగులు పట్టించుకున్నాడు. శంకరం ఎవరని అడిగితే- సత్యంనాయుడి సేవకుల్లో ఒకడనే చెప్పాలి. అయితే అతను నమ్మకస్తుడైన సేవకుల్లా వుండడు. తిరగబడాలన్న కృతనిశ్చయంతో వున్న బానిసలా వుంటాడు. శంకరం తాతతండ్రులు చేసిన అప్పులకి అతని జీవితం వడ్డీగా గుణించబడుతోంది. వసంతతో ఏ బంధుత్వముందో ఎవరికీ తెలీదు. ఆమె నవ్వితే తను నవ్వుతాడు. ఆమె దుఃఖాన్ని తనలో ఇముడ్చు కుంటాడు.

వసంత విషయంలో శంకరం కల్పించుకోవడం జోగులుకి నచ్చదు. ఈ కారణంగానే చాలాసార్లు ఇద్దరూ ఘర్షణపడ్డారు. శంకరం తరచూ రావడం లేదిప్పుడు. మరీ చూడాలన్పిస్తే జోగులు లేనప్పుడు వచ్చి పల్క రించి పోతుంటాడు. ఆడది రాజీపడితే ఎంత లోకువ చేస్తారో వసంతకి అనుభవమే. జోగుల్తో తిరిగే కొందరు ఆకతాయిలు చాటుమాటుగా డబ్బు ఎరజూపి సైగ జేసి నప్పుడు కనీసం శంకరానికి కూడా చెప్పుకోలేక పోయింది.

చందూ పుట్టాక కూడా జోగులు మారలేదు. గడిచిన పదేళ్లలోనూ వసంత జీవితంలో ఎదురుదెబ్బలే మిగిలాయి. ఆ దెబ్బలకి చందూ కూడా నలిగి పోయాడు. అందుకే ఆ వయస్సు ముఖానికుండాల్సిన వెలుగంతా ఆర్చుకపోయి అమావాస్యలు ఆవహిం చాయి.

*

హింసాత్మక సన్నివేశం తర్వాత మూడోరోజు రాత్రి-

సత్యంనాయుడి ఔట్‌హౌస్ హాలులో డిమ్‌లైట్లు మెరుస్తున్నాయి. అర్ధనగ్న నర్తకిలా చీకటి. టేబుల్‌పై దోరగా వేయించిన కోడిమాంసం, జీడిపప్పు, గాజు గ్లాసులో విస్కీ- రక్తంలో కొద్దిగా నీళ్లు కలిపినట్టు. ఐస్ క్యూబ్‌లు తేలుతున్నాయి. యాష్ ట్రేలో సిగరెట్ల చితి.

గ్లాసుల్లోని మందు వెచ్చగా గొంతు దిగుతుంటే మత్తుగా జోగుతున్న శరీరాలు. రాను రాను పెదాలు మొద్దుబారుతున్నాయి.

''అదేం ఆడదిరా? మైకాసంచుల్లో నీళ్లు పోసి నట్టు- బిగువు లేకుండా? మంచి సరుకు దొరకదురా నీకు.''

నిన్నటి అనుభవాన్ని నెమరేసుకుంటో సత్యం నాయుడన్న మాటలకి జోగులు గొంతు తడుము కున్నాడు.

''చెప్పరా! మంచి సరుకు దొరకదురా నీకు,'' సత్యంనాయుడు రెట్టించేడు.

''అన్నిసార్లు లేతమాంసమే కావాలి మీకు.''

పదాల్ని అతికించినట్లు ముద్ద ముద్దగా సమాధాన మిచ్చేడు జోగులు. ఆ మాటలకి నాయుడు పగలబడి నవ్వేడు. జోగులు వంత నవ్వేడు. ఆనక- తన శృంగా రానుభవాలను రసవత్తరంగా వర్ణించడం మొదలుపెట్టా డాయన. జోగులు వింటున్నాడు. మధ్య మధ్య కథ ల్లోంచి తప్పిపోతున్నా మళ్లీ సర్దుకుంటున్నాడు.

సత్యంనాయుడికి నలభై సంవత్సరాల వయసుం టుంది. లోటు లేనంత ఆస్తి వుంది. లంకంత ఇల్లుంది. కావల్సినంతమంది నౌకర్లున్నారు. ఇంట్లో కొన్ని గదుల్లో పులిచర్మాలు, తుపాకులు వేలాడుతుంటాయి. కొన్ని గదులైతే సంవత్సరాల తరబడి వాడనట్లు బూజులు

పట్టిన గుహల్లా వుంటాయి. ఆయన ప్రైవేట్ వ్యవహారాల కోసం ప్రత్యేకంగా ఔట్‌హౌసుంది. ఇంపుగా కన్పించిన ఆడదల్లా పక్కమీదకి కావాలనుకునే ధోరణి ఆయనది. పెళ్లయి పదిహేనేళ్లు దాటినా పిల్లలు పుట్టలేదు.

సత్యంనాయుడంటే జోగులుకి భయభక్తులున్నాయి. తన జీవితానికి ఆయనలాంటి వ్యక్తుల అండదండలవసరం. మనుషుల్ని చెప్పుచేతల్లో పెట్టుకోగల సమర్థత ఆయనకుంది. "నేనంటే భయం లేకుండా పోయిందిరా మీకు. నా తడాకా చూద్దురుగానుండండి," మాటిమాటికీ మెత్తగా మందలిస్తుంటాడు అందర్నీ. ప్రస్తుతం ఆయన వ్యాపార లావాదేవీలు చాలావరకు జోగులే చూస్తున్నాడు.

'వసంతలో ఇంకా అందం చచ్చిపోలేదు.' సత్యంనాయుడు ఆలస్యంగా తెలుసుకున్న నిజాలలో ఇదొకటి. తనేం కోరుకున్నా జోగులు కాదనడన్న నమ్మకం ఆయనలో బలంగా వుంది. అయితే తన మనసులో మాట ఎప్పుడూ బహిర్గతం చెయ్యలేదు.

కొద్దికాలంగా నాయుడిగారి వరస మారడాన్ని జోగులు గమనిస్తున్నాడు. తనపై కనబరుస్తున్న ఆపేక్షకి అంతరార్థమేమిటో ఇప్పుడిప్పుడే బోధపడుతోంది. ఎంత తెలిసినా ఏమీ తెలీనట్టు వ్యవహరించడం జోగులుకి అలవాటే. తన వస్తువేదో పరాధీనమైనట్టు అతనిలో ఒకానొక బాధ మెలితిరుగుతోంది- అగ్గిలా రాజుకుంటోంది. సత్యంనాయుణ్ణి ఏమీ చేయలేని అసహాయత్వం.

జోగులుకి మందు మోతాదు ఎక్కువ పడుతోంది. కావాలనే శృతిమించి తాగుతున్నాడు. తాగి తాగి వొళ్లు తెలీని స్థితిలో అక్కడే వున్న సత్యంనాయుడు డబుల్‌కాట్ మీదకి వాలిపోయాడు. జోగులు అపస్మారకంలోకి జారుకోగానే సత్యంనాయుడు మత్తుగా వళ్లు విరుచుకున్నాడు. అప్పుడు ఏ దిక్కుగా నడవాలో ఆయన పాదాలకి కొత్తగా నేర్పనవసరం లేదు.

*

తాటాకు పాక, చిరు వెలుగు పరుచుకున్న గదిలో చాపమీద చందు, వసంత. అక్కడ చీకటి అర్థనగ్నంగా లేదు. ముంచుకు రాబోతున్న ఉపద్రవంలా వుంది. చీకటిపడితే చాలు చందు భయంతో ముడుచుకుపోతాడు. చీకటంటే వసంతకీ ప్రాణసంకటమే.

గడియారం పదకొండు గంటలు కొట్టేవేళ తడిక తప్పిస్తున్న చప్పుడు. ఆ సమయంలో ఎవరొస్తారో వసంత గ్రహించగలదు. పచ్చిపుండులా సలుపుతోంది శరీరం. అయినా గాయాల కోసం సిద్ధం చేయాలి. తిరస్కరించి ఎన్నిసార్లు ఆ పశుబలం ముందు ఓడిపోలేదు? చందూ పక్క మీంచి మెల్లగా కటిక నేల మీదకి వొత్తిగిల్లింది.

సత్యంనాయుడు వసంతవేపు కొండచిలువలా ఆకలిగా కదిలేడు. విస్కీలో తేలుతున్న కళ్లు. చిన్న తల, పెద్ద శరీరం, కోరికగా వున్నప్పుడు అప్రమత్తంగా వుంటాడు. వూపిరి సలపనంతగా వసంతని పెనవేసుకున్నాడు. కొంచెం కొంచెంగా ఆక్రమించుకున్నాడు. తన బక్క ప్రాణం హరించుకుపోతున్నా గొంతులోనే బాధని తొక్కిపడుతూంది వసంత. చందు ఎక్కడ నిద్రలేస్తాడోనన్న శంకతో ఎంత యాతనైనా మౌనంగా భరిస్తూంది.

చందూ నిద్రపోలేదు. ఎటు తిరిగి పడుకున్నా గుండుసూదులే గుచ్చుకుంటున్నాయి. తడిక తప్పిస్తున్న చప్పుడూ విన్నాడు. తడిక మూసిన చప్పుడూ విన్నాడు. ఆ వేళప్పుడు శంకరం రాడు. ఎవరొచ్చిందీ చూసే ధైర్యం లేదు. బలవంతంగా రెప్పలు మూసేసుకున్నాడు. గుండెల్లోంచి రక్తం తోడేస్తున్నట్టు బలహీనపడుతోన్న శ్వాస. అయినా పిడికిళ్లు బిగుసుకుంటున్నాయి.

వాంఛ చల్లారింది. సత్యంనాయుడు వదిలిపెట్టాడు. అచేతనంగా అలాగే పడి వుండిపోయింది వసంత. 'ఎందుకీ బతుకు చావు రాకుండా? ఎందుకీ బతుకు,' కట్టలు తెంచుకుంటున్న కన్నీళ్లు. నిశ్శబ్దంగా నేలలోకి ఇంకిపోతున్నాయి.

నెలవంకలా వంపు తిరిగి పడుకున్న చందూ మీదకి ఆమె దృష్టి మరలింది. లీలగా... చందూ ముఖంలో శంకరం పోలికలు. 'అవును. చందుకోసమే బతకాలి. వీడే... వీడే నా జీవితానికి అన్నీ ఇక,' అనుకుంది. మనస్సు కొంత స్థిమితపడింది. చప్పుడు కాకుండా చందు పక్కకొచ్చి నిస్సత్తువగా ఒళ్లు వాల్చింది. తల్లి స్పర్శ సోకగానే చందూ రెప్పలు తెరుచుకున్నాయి. మసక మసగ్గా, చెల్లాచెదురుగా ఏవో దృశ్యాదృశ్యాలు. తల్లి తడి చెంపకి తన చెంప ఆన్చి మెడ చుట్టూ చేయి వేశాడు. ఆ చిన్నారి చేతిలోకి చిన్నపిల్లలా వొదిగిపోయింది వసంత.

ఎప్పటిలాగే రాత్రి విషపూరితంగా వుంది. గాఢాంధకారపు లోయలా ఆకాశం. వొణికిపోతున్న చెట్లు. చివికిపోతున్న పువ్వులు. నెర్రలు విచ్చిన నేల.

*ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధం, 6 ఫిబ్రవరి 1994*

